ప్రజాశక్తి
బుధవారం 16 అక్టోబరు 2024
5
శ్రీకాకుళం

బహిరంగంగా మద్యం సేవిస్తే చర్యలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

బహిరంగంగా మద్యం సేవించి న్యూసెన్స్ చేసే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోనున్నట్లు ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి హెచ్చరించారు. బహిరంగంగా మద్యం సేవించి న్యూసెన్స్ సృష్టించిన శ్రీకాకుళం నగరానికి చెందిన రౌడీ షీటర్ బలగ మురళీకృష్ణకు శ్రీకాకుళం సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు 14 రోజుల జైలు శిక్ష విధించినట్లు తెలిపారు. సోమవారం రాత్రి ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో మురళీకృష్ణ బహిరంగంగా మద్యం సేవించడంతో పాటు ప్రజలతో ఇబ్బందికరంగా ప్రవర్తించడంతో ఒకటో పట్టణ ఎస్ఐ హరికృష్ణ కేసు నమోదు చేసి కోర్టులో మంగళవారం హాజరు పరిచారు. ఈ క్రమంలో కోర్టు రోజుల జైలు శిక్ష విధించిందని వివరించారు.

మద్యం దుకాణాలకు లైసెన్సుల తంతు ముగియడంతో, సిండికేట్లు ఇక తదుపరి కార్యాచరణపై దృష్టిసారించారు. ఒక్కో మండలంలో ఇద్దరు, ముగ్గురు సిండికేట్లతో పాటు స్థానికంగా ఉన్న కొంతమంది వ్యాపారులు కలిసి కొన్ని దుకాణాలను దక్కించుకున్నారు. కొంతమంది సిండికేట్లు భారీగా అప్లికేషన్లు పెట్టినా ఒక్క దుకాణాన్నీ దక్కించుకోలేకపోయారు. దరఖాస్తుల రూపంలో రూ.లక్షలు పోగొట్టుకున్నారు. తమ సొంత మండలంలో వేరే వారికి షాపులు దక్కడంతో వారితో రాయబేరాలు మొదలుపెట్టారు. తమకు వాటాలు ఇవ్వాల్సిందేనంటూ పట్టుబడుతున్నారు. స్థానిక నాయకుల సహకారం లేనిదే షాపులు నిర్వహించే పరిస్థితి లేకపోవడంతో అన్యమనస్కంగానే వాటాలు ఇచ్చేందుకు లైసెన్స్‌దారులు అంగీకరిస్తున్నారు.

రాయ'బేరాలు'

- సొంత మండలంలో వేరే సిండికేట్లకు దక్కిన షాపులు
- వాటాల కోసం టిడిపి నాయకుల చర్చలు
- నేటి నుంచి అమల్లోకి నూతన ప్రయివేట్ మద్యం విధానం
- తెరుచుకోనున్న కొత్త దుకాణాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన మద్యం పాలసీ బుధవారం నుంచి అమల్లోకి రానుంది. ప్రయివేట్ మద్యం దుకాణాల ద్వారా అమ్మకాలు ప్రారంభం కానున్నాయి. మంగళవారం అర్ధరాత్రి నుంచి ప్రభుత్వ మద్యం విధానానికి తెరపడనుంది. జిల్లాలోని 158 మద్యం దుకాణాలకు ఈనెల 14వ తేదీన లాటరీ పద్ధతిలో దరఖాస్తుదారులకు లైసెన్స్‌లు కేటాయించిన సంగతి తెలిసిందే. సిండికేట్‌గా కొందరు, గ్రూపులుగా ఏర్పడి మరికొందరు దుకాణాలను దక్కించుకున్నారు. టెక్కలి నియోజకవర్గం మినహా మిగిలిన అన్ని ప్రాంతాల్లో టిడిపి, వైసిపి, జనసేన నాయకులూ దుకాణాలను దక్కించుకున్నారు. వేరే రాజకీయ పార్టీలు, వ్యక్తులు దక్కించుకున్న ప్రాంతాల్లో వ్యాపారులు కొంత ఇబ్బంది పడుతున్న పరిస్థితి కనిపిస్తోంది. తమకు వాటాలు ఇవ్వాల్సిందేనంటూ కూటమి నాయకులు ప్రధానంగా టిడిపి నాయకులు ఒత్తిళ్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. తమకు ఎంత వాటా ఇస్తారు?, లేకుంటే గుడ్‌విల్ ఇస్తాం వదిలేయాలంటూ ఫోన్ చేస్తున్నట్లు సమాచారం.

టెక్కలి, పలాస నియోజకవర్గాల్లో ఈరకమైన బెదిరింపులు ఉన్నట్లు వ్యాపార వర్గాల్లో చర్చ నడుస్తోంది. తాము చెప్పినట్లు చేయకపోతే దుకాణాలు నడపలేరంటూ పాతపట్నం నియోజకవర్గానికి చెందిన ఓ ముఖ్య ప్రజాప్రతినిధి ఫోన్లు చేసి బెదిరింపులకు దిగుతున్నట్లు తెలుస్తోంది. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ఒడిశా వ్యాపారులకు దక్కిన దుకాణాల్లో వాటాల కోసం రాయబేరాలు సాగిస్తున్నట్లు సమాచారం.

దుకాణాల అన్వేషణలో వ్యాపారులు

దుకాణాలు ఖరారు కావడంతో వ్యాపారులు షాపుల అన్వేషణలో పడ్డారు. కొత్త మద్యం పాలసీ ప్రకారం లైసెన్స్‌దారులు ఆ మండలంలో ఎక్కడైనా దుకాణం ఏర్పాటు చేసుకునే వీలుంది. దుకాణాలు ఎక్కడ ఏర్పాటు చేస్తే బాగుంటుందనే అంశంపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తున్నారు. షాపులను అద్దెకు తీసుకుని అక్కడ అవసరమైన సరంజామాలను సమకూర్చుకునే పనిలో అంతా నిమగ్నమయ్యారు. అందులో పనిచేసేందుకు తమకు అనుకూలురైన సిబ్బందిని తీసుకుంటున్నారు. గతంలో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేసి మంచి అనుభం ఉన్న వారికి ప్రాధాన్యం ఇస్తున్నారు. దుకాణాల్లో పని కల్పించాలంటూ సిఫార్సులతో కలుస్తున్న వారికి సైతం వ్యాపారులు భరోసా ఇస్తున్నారు. జిల్లాలో చాలాచోట్ల గతంలో నిర్వహించిన ప్రభుత్వ మద్యం దుకాణాల ప్రాంతం, ఆ దుకాణాల్లోనే కొత్తవి ఏర్పాటు చేసుకునేందుకు ప్రాధాన్యమిస్తున్నారు. శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గతంలో నిర్వహించిన ప్రభుత్వ మద్యం దుకాణాలున్న చోటనే అద్దెకు తీసుకుని నిర్వహించేందుకు దుకాణాల యజమానులతో సంప్రదింపులు చేస్తున్నారు.

అప్పడే 'బెల్టు' కోసం ప్రయత్నాలు

దుకాణాలు పొందిన వ్యాపారులు మండలంలో ఎక్కడెక్కడ షాపులు ఏర్పాటు చేస్తే వ్యాపారం బాగుంటుందో ఆరా తీస్తున్నారు. బాగా వ్యాపారం జరిగే ప్రాంతాల్లో దుకాణం ఏర్పాటు చేసి, సమీప గ్రామాల్లో బెల్టు షాపులు ఏర్పాటు చేసేందుకు దుకాణాలను అద్దెకు తీసుకునేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. షాపులు దక్కించుకున్న వారంతా సిండికేట్లు, టిడిపి నాయకులే కావడంతో బెల్టుకు అడ్డే ఉండదని వారంతా భావిస్తున్నట్లుగా తెలుస్తోంది. ఇదే జరిగితే జిల్లాలో మద్యం ఏరులై పారడం ఖాయమనే చర్చ నడుస్తోంది.

సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాద్

మున్సిపల్ ఉపాధ్యాయులపై ఉదాసీనం

- 17న డిఇఒ కార్యాలయం వద్ద ధర్నా
- యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వర్లు, ప్రసాద్

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

మున్సిపల్ ఉపాధ్యాయులు దీర్ఘకాలిక సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ ఉదాసీనతను నిరసిస్తూ ఈనెల 17న డిఇఒ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టనున్నట్లు యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఎన్.వెంకటేశ్వర్లు, కె.ఎస్.ఎస్ ప్రసాద్ తెలిపారు. శ్రీకాకుళం నగరంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ఆ సంఘ ఆఫీస్ బేరర్స్ సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం, అధికారులు అనేక పర్యాయాలు హామీలిచ్చినా నిలబెట్టుకోలేదని, పిఎఫ్, అప్‌గ్రేడేషన్, ప్రమోషన్లు, బదిలీలు వెంటనే నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేయాలని నిర్ణయించామని తెలిపారు. మున్సిపల్ ఉపాధ్యాయులను 2022 జూన్‌లో మున్సిపల్ పాఠశాల విద్యాశాఖ పర్యవేక్షణలోకి తీసుకొచ్చారని గుర్తుచేశారు. జిల్లాపరిషత్ ఉపాధ్యాయులకు మాదిరిగా అన్నిరకాల జిఒలు అమలవుతాయని భావించామని, ఒక్క డిడిఒ అధికారం తప్ప మిగిలిన సమస్యలన్నీ అలాగే అపరిష్కృతంగానే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జిపిఎఫ్ ఇవ్వాల్సిన ప్రభుత్వం ఇప్పటివరకు ఆ ప్రక్రియే నడపలేదని, తక్షణం ఖాతాలను ప్రారంభించి ఉపాధ్యాయులకు రక్షణ కల్పించాలని కోరారు. ఆర్థికశాఖ కొర్రీతో మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఇప్పటికీ ఎస్‌జిటిలే పనిచేస్తున్నారని, ఆ పోస్టులన్నీ అప్‌గ్రేడేషన్ చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా ఆర్థిక సమస్య పరిష్కారం కాలేదని చెప్పారు. మున్సిపల్ ఉపాధ్యాయులకు 2017 నుండి బదిలీలు లేక ఇబ్బందులు పడుతున్నారని, తక్షణం ప్రమోషన్లు బదిలీలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పాఠశాల విద్యాశాఖ తక్షణం జోక్యం చేసుకొని మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా డిఇఒ కేంద్రాల వద్ద చేపట్టనున్న ధర్నాలకు ఆయా ప్రాంతాల ఉపాధ్యాయులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు ఆర్.మోహన్‌రావు, ఎస్.కిషోర్ కుమార్ మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేస్తారని ఆశించామని, బోధనేతర కార్యక్రమాలు ఎక్కువ చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. యాప్‌ల సమస్యల నుంచి తక్షణం ఉపాధ్యాయులను తప్పించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని, వారిని బోధనకే పరిమితం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.బాబూరావు, బి.శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా రాష్ట్ర ఎంఎస్‌ఎంఇ, సెర్ప్, ఎన్‌ఆర్‌ఐ వ్యవహారాలశాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను ప్రభుత్వం నియమించింది. జిల్లాలకు ఇన్‌ఛార్జి మంత్రులను నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం జిఒ నంబరు 3ను విడుదల చేసింది. ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో విజయనగరం జిల్లా గజపతినగరం నియోజకవర్గం నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆయన్ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేబినెట్ మంత్రిగా అవకాశం కల్పించిన సంగతి తెలిసిందే. జిల్లాకు చెందిన రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుని రెండు జిల్లాలకు ఇన్‌ఛార్జిగా నియమించింది. కొత్తగా ఏర్పడిన పార్వతీపురం మన్యం, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలకు ఇన్‌ఛార్జి మంత్రి బాధ్యతలను అప్పగించింది.

విశాఖ ఉక్కు ఊసెత్తని ప్రభుత్వం

- ఎక్సైజ్ పాలసీలో పారదర్శకతకు పాతర
- మాజీ స్పీకర్ తమ్మినేని

ప్రజాశక్తి - ఆమదాలవలస

విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై కూటమి ప్రభుత్వం నోరెత్తకపోవడం దారుణమని మాజీ స్పీకర్, వైసిపి జిల్లా పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకులు తమ్మినేని సీతారాం అన్నారు. పట్టణంలోని తన నివాసంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ విషయంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నోరెత్తకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న మద్యం దుకాణాలను పక్కనపెట్టి, టెండర్ల విధానంలో మద్యం దుకాణాలను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టడం కూటమి ప్రభుత్వ దగాకోరు విధానాలకు నిదర్శనమని దుయ్యబట్టారు. కేవలం పది రోజుల వ్యవధిలోనే మద్యం దుకాణాలను ఖరారు చేసేందుకు లైసెన్స్‌ల కోసం దరఖాస్తులను ఆహ్వానించడం, వెను వెంటనే ఖరారు చేయడం వెనక భారీ అవినీతి చోటుచేసుకుందని ఆరోపించారు. ప్రభుత్వ దుకాణాలను మూసివేసి ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడం ద్వారా ప్రభుత్వ ఆదాయాన్ని లూటీ చేసేందుకు బరితెగించారని ధ్వజమెత్తారు. ప్రభుత్వ నీతిమాలిన చర్య వల్ల 15వేల మంది ఉద్యోగులు వీధిన పడ్డారని తెలిపారు. ఏకపక్షంగా 80 శాతం దుకాణాల లైసెన్సులు కూటమి సర్కారుకు చెందిన వ్యక్తులే దక్కించుకున్నారని, 20 శాతం లైసెన్సులు దక్కించుకున్న ఇతరులను బెదిరిస్తూ లాక్కునేందుకు తెగబడటం దారుణమన్నారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా 45 వేల బెల్టుషాపులను రద్దు చేయడమైందని, వీటి పునరుద్ధరణకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్న విషయం నిజం కాదా అని ప్రశ్నించారు. ఇదే జరిగితే గ్రామాల్లో మద్యం ఏరులై పారడం ఖాయమన్నారు. ఉచిత ఇసుక అంటూ ఎన్నికల ముందు ప్రచారం చేసి, ఇప్పుడు రెండు రోజుల స్వల్ప విరామంలోనే 108 ఇసుక రీచ్‌లకు టెండర్లు ఖరారు చేశారని చెప్పారు. రహస్యంగా ప్రభుత్వ పెద్దలకు వారికి కావాల్సిన వారితో టెండర్లు దాఖలు చేయించి బహిరంగ ఇసుక దోపిడీకి పాల్పడడం సిగ్గుచేటు అని అన్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ఏర్పడి నాలుగు నెలలు గడుస్తున్నా సూపర్ సిక్స్ అంటూ ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేకపోయారని విమర్శించారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయని నూనె, ఉల్లిపాయలు, టమోటో, కూరగాయల ధరలు సామాన్యుడికి అందనంత ఎత్తులో ఉన్నాయని మండిపడ్డారు. ఇసుక అందుబాటులో లేక భవన నిర్మాణ కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అమరావతి రాజధాని నిర్మాణానికి అనుకూలం కాదని నిపుణులతో కూడిన కమిటీలు నివేదికలు ఇచ్చినా, అక్కడే నిర్మాణాలు చేపట్టడం వెనక ఉన్న ఆంతర్యమేమిటో అర్థం కావడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని కాంక్షించి ప్రజలకు చక్కని సేవలు అందించాలని తమ్మినేని హితవు పలికారు. సమావేశంలో మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షులు బద్రి రామారావు, బొడ్డేపల్లి మన్మథరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ స్పీకర్ సీతారాం

మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

నీటితీరువా లక్ష్యాన్ని చేరుకోవాలి

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

సాగునీటి సంఘాలకు త్వరలో ఎన్నికలు నిర్వహించనున్నందున నీటి తీరువా వసూళ్ల లక్ష్యాన్ని చేరుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ నిధులతో చేపట్టిన పనులు వేగవంతం చేయడంతో పాటు పనిదినాలు జనరేట్ అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టరేట్ నుంచి జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి ఎంపిడిఒలు, తహశీల్దార్లు, పంచాయతీరాజ్, ఎన్‌ఇజిఎస్ ఎపిఒలు, ఆర్‌డబ్ల్యుఎస్, హౌసింగ్ ఇంజినీరింగ్ అధికారులతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉపాధి హామీ నిధులతో చేపట్టిన పనుల పురోగతి, పనిదినాల జనరేట్, గృహ నిర్మాణాలు, ఎస్‌డబ్ల్యుపిసి షెడ్ మరమ్మతులు, మంచినీటి ట్యాంకులకు క్లోరినేషన్, పల్లె పండగ పంచాయతీ వారోత్సవాల్లో కార్యక్రమాల అమలు వంటి అంశాలపై మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి హామీ నిధులతో గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీరాజ్ శాఖల ద్వారా గ్రామస్థాయిలో చేపట్టిన పనులను వంద శాతం పూర్తి చేయాలన్నారు. స్వర్ణాంధ్ర యాక్షన్ ప్లాన్ అనుగుణంగా పనులు చేపట్టేందుకు అధికారులు ప్రత్యేక కృషి చేయాలన్నారు. పల్లె పండగ పంచాయతీ వారోత్సవాలు సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో జిల్లాలో విజయవంతంగా నిర్వహించాలన్నారు. ప్రతి పంచాయతీ పరిధిలో ఈ ఏడాదిలో చేసే అభివృద్ధి పనుల వివరాలు ఆయా గ్రామాల్లో బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. హౌసింగ్ పనులకు సంబంధించి నిర్మాణ పనులకు ఇబ్బందులు తలెత్తకుండా ఇసుక, సిమెంట్ ఇతర మెటీరియల్ అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. సచివాలయం సిబ్బంది సక్రమంగా తమ పరిధిలోని పాఠశాలల్లో మధ్యాహ్నం భోజనం నాణ్యతను పరిశీలించి ఎప్పటికప్పుడు వివరాలు యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. జిల్లాలోని అన్ని పాఠశాలలు, సంక్షేమ వసతిగృహాలు, గ్రామాల్లో ఉన్న మంచినీటి ట్యాంకులకు క్లోరినేషన్ పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాల మరమ్మతు పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలన్నారు.

జిల్లాలో 'ఉల్లాస్' కార్యక్రమంలో భాగంగా నిరక్షరాస్యులందరినీ వచ్చే మూడేళ్లలో అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలన్నారు. స్వయం సహాయక సంఘాల్లోని మహిళా సభ్యులకు డిజిటల్ లిటరసీ, ఫంక్షనల్ లిటరసీ, ఫైనాన్షియల్ లిటరసీ కార్యక్రమాల ద్వారా బ్యాంకుల ద్వారా రుణాలు పొందడం, సంఘాల రికార్డుల నిర్వహణ, కాంట్రాక్టులు, అగ్రిమెంట్స్, ఆన్‌లైన్ లావాదేవీలు తదితర అంశాలపై అవగాహన కలిగించాలన్నారు. సమావేశంలో డిఆర్‌ఒ అప్పారావు, వ్యవసాయ శాఖ జెడి కె.త్రినాథస్వామి, జిల్లా పంచాయతీ అధికారి కె.భారతి సౌజన్య, ఐసిడిఎస్ పీడీ బి.శాంతి, నీటిపారుదల శాఖ ఎస్‌ఇ పి.సుధాకర్, డిఆర్‌డిఎ పీడీ కిరణ్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న పోస్టల్ సంఘాల నాయకులు, ఉద్యోగులు

సమస్యల పరిష్కారానికి దశల వారీ పోరాటం

ప్రజాశక్తి - శ్రీకాకుళం

పోస్టల్ శాఖలో పలు కేడర్లలో పనిచేస్తున్న ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి దశలవారీ పోరాటాలను చేపట్టనున్నట్లు గ్రూప్-సి సంఘం రాష్ట్ర అధ్యక్షులు గణపతి, పోస్టుమెన్ యూనియన్ జిల్లా కార్యదర్శి బాబూరావు తెలిపారు. పలు సమస్యల పరిష్కారం కోరుతూ జాయింట్ కౌన్సిల్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయిస్ ఆధ్వర్యాన అన్ని డివిజన్లలో మంగళవారం గేట్ మీటింగ్‌లను నిర్వహించి డివిజనల్ అధికారులకు మెమోరాండం అందజేశారు. అనంతరం జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోస్టల్ శాఖ రద్దు చేసిన ఎన్‌ఎఫ్‌పిఇ, ఎఐపిఇయు జిఆర్-సి సంఘాల గుర్తింపును తక్షణమే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. గుర్తింపు రద్దు విషయంలో జార్ఖండ్ హైకోర్టు ఇచ్చిన స్టే ఆర్డర్‌ను అమలు చేయాలన్నారు. పోస్టల్ శాఖను కార్పొరేటీకరణ, ప్రైవేటీకరణ దిశగా ప్రోత్సహించే పోస్టల్ యాక్ట్-2023ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఐపిపిబి ఆధ్వర్యాన నిర్వహిస్తున్న సాంకేతికపరమైన అన్ని పనులను గతంలో మాదిరిగా పోస్టల్ శాఖ ఆధ్వర్యాన నడిపించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఎనిమిదో వేతన సవరణ కమిటీ వెంటనే నియమించాలని, పాత పెన్షన్ విధానాన్ని తిరిగి పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అన్ని కేడర్లలో ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణమే భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో జిడిఎస్ సంఘం జిల్లా నాయకులు బెవర అప్పారావు, పి-3 అధ్యక్షులు యు.వి రమణ, పి-4 అధ్యక్షులు వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు వాన శ్రీనివాసరావు, గురన్న, రామకోటి తదితరులు పాల్గొన్నారు.

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

15 ఏళ్లు నిండిన నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. వయోజన విద్యపై కలెక్టర్ ఛాంబరులో మంగళవారం ఆయన సమీక్షించారు. ఉల్లాస్ కార్యక్రమం ద్వారా ప్రధానంగా స్వయం సహాయక సంఘాల లబ్ధిదారులు, ఆయాలు, ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేసే నైట్ వాచ్‌మెన్లు తదితరులపై దృష్టిసారించాలని సూచించారు. స్వయం సహాయక సంఘాల ద్వారా నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలన్నారు. అంగన్వాడీ భవనాల్లో సాయంత్రం తరగతులు నిర్వహించాలని సూచించారు. ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ సెక్రటరీ నోడల్ అధికారులుగా ఉండాలన్నారు. మండలాల వారీగా అక్షరాస్యత లక్ష్యాలను నిర్దేశించాలని చెప్పారు. శిక్షణ సమయంలో అంగన్వాడీ, సామాజిక భవనాలను సాయంత్రం అందుబాటులో ఉంచాలని తెలిపారు. జిల్లా, మండల స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. విఒఎలు, క్లస్టర్ రిసోర్స్‌పర్సన్స్ ద్వారా వాలంటీర్ టీచర్లను నేర్చుకునే వారిని గుర్తించాలని డిఆర్‌డిఎ పీడీ కిరణ్ కుమార్‌ను ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాలను సాయంత్రం రెండు గంటలు అక్షరాస్యత తరగతులకు అందుబాటులో ఉంచాలని ఐసిడిఎస్ పీడీ బి.శాంతిశ్రీని ఆదేశించారు. వాలంటీర్ టీచర్లు, లెర్నర్స్ ఉల్లాస్ యాప్ ద్వారా వారి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. సమావేశంలో వయోజన విద్య ఉప సంచాలకులు ముద్దాడ వెంకటరమణ, సభ్యులు డిపిఒ కె.భారతి సౌజన్య, డిఐపిఆర్‌ఒ కె.చెన్నకేశవరావు, ఎపిఒ బాలచందర్, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

IN THE HONOURABLE COURT OF THE SENIIOR CIVIL JUDGE COURT AT RAJAM
I.A. 91/2023 in I.A. 209/2023 in O.S. 20/2018

Between:
Maroju Vidya Sagar
. . . Petitioner/ defendant
And:
Nemalipuri Manmadha Rao
. . . Respondent/Plaintiff
Respondent/Plaintiff:
Nemalipuri Manmadha Rao,
S/o. Pentayya, Hindu,
aged 63 years,
R/at Plot No: 4,
Sai nagar Colony,
Peddapadu Road, Balaga Rural,
Srikakulam Mandal & Dist.

NOTICE

Please take notice that the above I.A. 91/2023 in I.A. 209/2023 in O.S. 20/2018 stands posted to **21-10-2024** for your appearance before the Honorable Court therefore you are hereby directed to appear before the Honorable Court on **21-10-2024 at 10:30 A.M.** either in person or through an advocate failing with matter will be decided in your absence.

//By Order//
K SATYAVANI
Advocate
Srikakulam
Cell: 9985109366

మహారాజశ్రీ పొందూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు వారి దివ్య సుముఖమునకు
IA.641/2023 in OS.83/2021

భూపతి రామదాసు ....పిటిషనర్/వాది
భూపతి శ్రీరాములు(డైడ్) వగైరాలు
....రెస్పాండెంట్/ప్రతివాదులు

To,
R-7: భూపతి రమణమ్మ, W/o Late శ్రీరాములు, 55 సం॥, హిందూ, గృహకృత్యములు, సా॥, చెట్టు పొదిలాం గ్రామం, జి. సిగడాం మండలం, శ్రీకాకుళం జిల్లా ...7వ రెస్పాండెంట్
R-8: భూపతి సంతోష్ కుమార్, S/o Late శ్రీరాములు 30 స॥ హిందూ, ఐ.డి.బి.ఐ బ్యాంక్ ఉద్యోగి కర్నూలు, కర్నూలు జిల్లా ...8వ రెస్పాండెంట్

పై నెంబర్ దావాలో పిటిషనర్-వాది మీపైన అనగా 7,8 రెస్పాండెంట్లు పైన పంపకం నిమిత్తం పైకోర్టులో దావాను దాఖలు చేయగా సదరు దావాలో మీ హాజరు నిమిత్తం **తేదీ 18-10-20 24న** పైకోర్టులో వాయిదా అయి ఉన్నది. సదరు వాయిదా నాడు మీరు గాని, మీ వకీల్ గారి ద్వారా గాని హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలియజేసుకోవలెను. లేనియెడల మీ పరోక్షమందు దావాను తీర్మానించబడును.

మెట్ట దామోదర రావు
వాది తరపు న్యాయవాది,
పొందూరు, శ్రీకాకుళం.

మహారాజశ్రీ పొందూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు వారి దివ్య సుముఖమునకు
IA.642/2023 in OS.83/2021

భూపతి రామదాసు ....పిటిషనర్/వాది
భూపతి శ్రీరాములు(డైడ్) వగైరాలు
....రెస్పాండెంట్ ప్రతివాదులు

To,
R-7: భూపతి రమణమ్మ, W/o Late శ్రీరాములు, 55 సం॥, హిందూ, గృహకృత్యములు, సా॥, చెట్టు పొదిలాం గ్రామం, జి. సిగడాం మండలం, శ్రీకాకుళం జిల్లా ...7వ రెస్పాండెంట్
R-8: భూపతి సంతోష్ కుమార్, S/o Late శ్రీరాములు 30 స॥ హిందూ, ఐ.డి.బి.ఐ బ్యాంక్ ఉద్యోగి కర్నూలు, కర్నూలు జిల్లా ...8వ రెస్పాండెంట్

పై నెంబర్ దావాలో పిటిషనర్-వాది మీపైన అనగా 7,8 రెస్పాండెంట్లు పైన పంపకం నిమిత్తం పైకోర్టులో దావాను దాఖలు చేయగా సదరు దావాలో మీ హాజరు నిమిత్తం **తేదీ 18-10-20 24న** పైకోర్టులో వాయిదా అయి ఉన్నది. సదరు వాయిదా నాడు మీరు గాని, మీ వకీల్ గారి ద్వారా గాని హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలియజేసుకోవలెను. లేనియెడల మీ పరోక్షమందు దావాను తీర్మానించబడును.

మెట్ట దామోదర రావు
వాది తరపు న్యాయవాది,
పొందూరు, శ్రీకాకుళం.

మహారాజశ్రీ పొందూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు వారి దివ్య సుముఖమునకు
IA.643/2023 in OS. 83/2021

భూపతి రామదాసు ....పిటిషనర్/వాది
భూపతి శ్రీరాములు(డైడ్) వగైరాలు
....రెస్పాండెంట్ ప్రతివాదులు

To,
R-7: భూపతి రమణమ్మ, W/o Late శ్రీరాములు, 55 సం॥, హిందూ, గృహకృత్యములు, సా॥, చెట్టు పొదిలాం గ్రామం, జి. సిగడాం మండలం, శ్రీకాకుళం జిల్లా ...7వ రెస్పాండెంట్
R-8: భూపతి సంతోష్ కుమార్, S/o Late శ్రీరాములు 30 స॥ హిందూ, ఐ.డి.బి.ఐ బ్యాంక్ ఉద్యోగి కర్నూలు, కర్నూలు జిల్లా ...8వ రెస్పాండెంట్

పై నెంబర్ దావాలో పిటిషనర్-వాది మీపైన అనగా 7,8 రెస్పాండెంట్లు పైన పంపకం నిమిత్తం పైకోర్టులో దావాను దాఖలు చేయగా సదరు దావాలో మీ హాజరు నిమిత్తం **తేదీ 18-10-20 24న** పైకోర్టులో వాయిదా అయి ఉన్నది. సదరు వాయిదా నాడు మీరు గాని, మీ వకీల్ గారి ద్వారా గాని హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలియజేసుకోవలెను. లేనియెడల మీ పరోక్షమందు దావాను తీర్మానించబడును.

మెట్ట దామోదర రావు
వాది తరపు న్యాయవాది,
పొందూరు, శ్రీకాకుళం.

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అశోక్

అన్న క్యాంటీన్ ప్రారంభం

ఇచ్ఛాపురం : ప్రజా సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. పట్టణంలో మున్సిపల్ కార్యాలయ వద్ద ఏర్పాటు చేసిన అన్నా క్యాంటీన్ మంగళవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత దశల వారీగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుందని అన్నారు. అందులో భాగంగానే పల్లె పండగ అని అన్నారు. పేద, కష్టజీవులకు అన్నా క్యాంటీన్ ద్వారా తక్కువ ధరకే ఆహార పదార్థాలు అందిస్తున్నామని అన్నారు. నాణ్యత లోపించకుండా ఆహార పదార్థాలు అందిస్తున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పి.రాజ్యలక్ష్మి, జనసేన ఇన్‌ఛార్జి దాసరి రాజు, టిడిపి నాయకులు సాలిన ఢిల్లీ, కాళ్ల ధర్మారావు, నందిక జాని, పద్మనాభం, నిర్మలారెడ్డి, కమిషనర్ రమేష్, జెన్నల సంతోష్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఇ ప్రసాదరావు

సోలార్ రూఫ్ టాప్‌తో బిల్లు ఆదా

ప్రజాశక్తి- మెళియాపుట్టి

ప్రధానమంత్రి సూర్య ఘర్ యువజన పథకంలో భాగంగా సోలార్ రూఫ్ టాప్ నిర్మించుకొనే సౌకర్యాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని పాతపట్నం విద్యుత్‌శాఖ డిఇ ప్రసాదరావు అన్నారు. స్థానిక సబ్ స్టేషన్ కార్యాలయంలో పిఎం సూర్య ఘర్ యోజన పథకంపై మంగళవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సొంత ఇల్లు ఉన్నవారు సోలార్ సిస్టం ఏర్పాటు చేసుకోవడంతో కలిగే లాభాలను ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రభుత్వం ఇచ్చే రాయితీతో సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకోవాలని ప్రజలకు తెలియజేయాలన్నారు. ఈ పథకం వల్ల గృహ వినియోగదారులకు అతి తక్కువ విద్యుత్ బిల్లు వస్తుందన్నారు. ఈ పథకానికి తక్కువ వడ్డీకి బ్యాంకు రుణాలు లభిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఎఇ, సబ్ ఇంజినీర్, లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్లు పాల్గొన్నారు.

ప్రపంచ కళా జాతరకు రాములు ఎంపిక

ప్రజాశక్తి- ఆమదాలవలస

రాములు

కళా వేదిక ప్రపంచ కళా జాతరకు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ కె.ఎ.రాములు ఎంపికయ్యారు. ఈ నెల 19,20 తేదీల్లో పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలోని బుద్దాల కన్వెన్షన్ హాలులో జరుగు ప్రపంచ తెలుగు సాహితీ కళా జాతరకు ఎంపికైనట్లుగా, అలాగే తాను ప్రదర్శించే జానపద గేయాలు, మౌత్ ఆర్గాన్, మరియు గజల్ సాంగ్స్ ప్రదర్శించనున్నారు. ఈ అవకాశాన్ని ఐఎస్ఒ గుర్తింపు పొందిన శ్రీశ్రీ కళా వేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి, జాతీయ ప్రధాన కార్యదర్శి టి.పార్థసారథి, ఉత్తరాంధ్ర అధ్యక్షులు మహ్మద్ రఫీ (ఈవేమన) నుంచి ఆహ్వానం అందింది. ఈ అవకాశం వచ్చినందుకు జిల్లా కళా సంఘాలతో పాటు ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేశారు.

కలాం జీవితం స్ఫూర్తిదాయకం

నరసన్నపేట : మాట్లాడుతున్న దుర్గాప్రసాద్

ప్రజాశక్తి- నరసన్నపేట

మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని పెద్ద పెద్ద కలలు కనాలని, గొప్ప విజయాలు సాధించాలని పద్మావతి డిగ్రీ కళాశాల డైరెక్టర్ సిహెచ్.దుర్గాప్రసాద్ అన్నారు. స్థానిక పద్మావతి డిగ్రీ కళాశాలలో అబ్దుల్ కలాం జయంతి మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశం కోసం ఆయన చేసిన సేవలు, బోధనలు ఎప్పటికీ మనకి స్ఫూర్తి కలిగిస్తూనే ఉంటాయన్నారు. విద్యార్థులను సమాజంలో విప్లవాత్మకంగా మార్చే భవిష్యత్ నాయకులుగా మార్చే ప్రయత్నం చేశారని అన్నారు. కార్యక్రమంలో కళాశాల అకడమిక్ ఇన్‌ఛార్జి ముకల్ల శ్రీనివాసరావు, అధ్యాపకులు గౌరీశంకర్, కె.రాము పాల్గొన్నారు.

లావేరు : లావేరు గ్రంథాలయంలో అబ్దుల్ కలాం చిత్రపటానికి గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు టి.వీరభద్రుడు, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పొందూరు: మండలంలోని తాడివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అబ్దుల్ కలాం చిత్రపటానికి ప్రధానోపాధ్యాయులు బల్ల కంటయ్య పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

పలాస : మండలంలోని బ్రాహ్మణతర్ల ఉన్నత పాఠశాలలో కలాం చిత్రపటానికి ప్రధానోపాధ్యాయుడు ఎస్.వి.రమణారావు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

సంతబొమ్మాళి : సంతబొమ్మాళి శాఖాగ్రంథాలయంలో గ్రంథాలయాధికారి కె.రామకృష్ణ చిత్రపటానికి పూలమాలలు

ఇచ్ఛాపురం : చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న విద్యార్థులు

టెక్కలి : చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న శ్రీనివాసరావు

వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు బాబూరావు, పాఠకులు ఉమామహేష్, నారాయణ, సందీప్, రవికుమార్ పాల్గొన్నారు.

టెక్కలి : స్థానిక అమ్మఒడి పాఠశాల ఆవరణలో కలాం చిత్రపటానికి కరస్పాండెంట్ బరాటం శ్రీనివాసరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు దామోదరరావు, ఉపాధ్యాయులు పుష్పలత, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి బి.రూపావతి, టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బేపల సతీష్‌కుమార్, ఎ.రామారావు, వి.లూక్‌పాల్ పాల్గొన్నారు.

చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న కాకినాడ ఆదిత్య విద్యార్థులు

కాకినాడ ఆదిత్య డిగ్రీ కళాశాలలో...

శ్రీకాకుళం : నగరంలోని ఎల్ఐసి కార్యాలయం పక్కన ఉన్న కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో ఘనంగా అబ్దుల కలామ్ జయంతిని నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ బి.ఎస్.చక్రవర్తి, ప్రిన్సిపాల్ కె.శివశంకర్ కలామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ కలాం ప్రపంచ దేశాలు మెచ్చిన గొప్ప శాస్త్రవేత్త అని అన్నారు. మన దేశ శాస్త్ర సాంకేతిక రంగంలో విశేష కృషి చేసి అనేక పురస్కారాలు, గౌరవాలు పొందారన్నారు. భారతదేశ రాష్ట్రపతిగా సేవలందించారన్నారు. ఇప్పటికీ ఎంతో మంది విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె.వేణు, లైబ్రేరియన్ కమల్ కుమార్ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : స్థానిక స్వర్ణ భారతీ విద్యా సంస్థలో కలాం చిత్రపటానికి చైర్మన్ చాట్ల తులసీదాసురెడ్డి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు విద్యార్థులు కలాం బాటలో పయనించాలన్నారు.

వ్యక్తి ప్రాణాలు కాపాడిన పోలీసులు

ఎస్‌పి మహేశ్వర రెడ్డి ప్రశంసలు

శ్రీకాకుళం: విధి నిర్వహణలో బాధ్యతగా, అప్రమత్తంగా ఉండి ఓ వ్యక్తి ప్రాణాలు కాపాడటం హర్షించదగ్గ విషయమని ఎస్‌పి ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో హెడ్ కానిస్టేబుల్ టి.అమ్మాజి, ఆర్మ్డ్ రిజర్వ్ పోలీస్ కానిస్టేబుల్ చంద్రశేఖర్, మహిళా హోంగార్డు నారాయణమ్మలకు నగదు పురస్కారం, ప్రశంసాపత్రాలను మంగళవారం అందజేశారు. వివరాల్లోకి వెళ్తే... సోమవారం రాత్రి1.30 గంటల సమయంలో శ్రీకాకుళం వన్ టౌన్ స్టేషన్ బీట్ తనిఖీ అధికారి, హెడ్ కానిస్టేబుల్ టి.అమ్మాజీ తన విధి నిర్వహణలో భాగంగా తన సిబ్బందితో పొన్నాడ బ్రిడ్జి వైపు వెళ్తున్నాడు. అదే సమయంలో శ్రీకాకుళం పట్టణం మావూరి వీధికి చెందిన గుంటాముక్కల శివప్రసాద్ పొన్నాడ బ్రిడ్జి పైనుంచి నాగావళి నదిలోకి దిగి ఆత్మహత్యప్రయత్నం చేసుకొనుందుకు ప్రయత్నించారు. దీనిని గుర్తించిన నైట్ బీట్ తనిఖీ అధికారి తన సిబ్బందితో హుటాహుటిన పొన్నాడ వంతెన కిందకు దిగి ఒడ్డుకు తీసుకువచ్చి ప్రాణాలు

నగదు ప్రోత్సాహకాన్ని అందజేస్తున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

కాపాడారు. ఆత్మయత్యాయత్నానికి పాల్పడిన కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కౌన్సెలింగ్ ఇచ్చారు. సమస్యకి చావు ఒకటే పరిష్కారం కాదని, క్షణకావేశంతో తీసుకున్న నిర్ణయాలు తీవ్ర నష్టాన్ని కలిగిస్తాయని అన్నారు. మనపై ఆధారపడిన ఉన్న తల్లిదండ్రులు, పిల్లల గురించి ఆలోచించాలని తెలిపారు. మనోధైర్యంతో ఎంతటి కష్టాన్ని, సమస్యనైనా ఎదిరించవచ్చని కౌన్సెలింగ్ చేశారు. అనంతరం పోలీసు వాహనంపై అతనికి ఇంటికి తీసుకువెళ్లి తల్లిదండ్రులకు అప్పగించారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి పి.శ్రీనివాసరావు, డిఎస్‌పి వివేకానంద్, సిఐ పైడిపునాయుడు, ఎస్ఐ హరికృష్ణ పాల్గొన్నారు.

కలెక్టర్‌తో మాట్లాడుతున్న బాబూరావు

కలెక్టర్‌ను కలిసిన బాబూరావు

పలాస : కలెక్టరేట్‌లో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పలాస నియోజకవర్గం సమస్యలపై కలెక్టర్‌కు విన్నవించారు. ఆయనతో పాటు టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, టంకాల రవి శంకర్ గుప్తా, బి.నాగరాజు, డొక్కరి శంకర్, కొరికాన శంకర్, సాసుమాన చంద్రమౌళి, జోగ మల్లి, యవ్వరి మోహనరావు పాల్గొన్నారు.

ఎస్‌పిడికి ఎస్‌టి కమిషన్ నోటీసు

టెక్కలి : సమగ్ర శిక్షా అభియాన్ ఎస్‌పిడి బి.శ్రీనివాసరావుకు ఎస్‌టి కమిషన్ నోటీస్‌లు జారీ చేసిందని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాబ యోగి ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల సర్వశిక్షా అభియాన్‌లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసే ప్రక్రియలో భాగంగా జారీ చేసిన నోటిఫికేషన్‌లో ఎస్‌సి, ఎస్‌టిలకు రోస్టర్ పాయింట్ల విధానాన్ని అమలు చేయలేదని అన్నారు. ఈ అంశంపై ఫిర్యాదు చేయడంతో నోటీస్‌లు జారీ చేసిందని అన్నారు. దీనిపై సంబంధిత అధికారులు ఏ రీతిన స్పందిస్తారో వేచి చూడాలన్నారు.

ఈ-క్రాప్ సరిచూసుకోవాలి

కవిటి: ఈ-క్రాప్ నమోదు చేసుకున్న రైతుల జాబితాను స్థానిక రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శిస్తున్నారని, రైతులు తమ తమ వివరాలు సరిచూసుకోవాలని మండల ఎఒ బడగల దుర్గా ప్రసాద్ సూచించారు. ఈ మేరకు రైతు సేవా కేంద్రం వద్ద మంగళవారం జాబితాను ప్రదర్శించారు. ప్రతి రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ, ఉద్యాన శాఖల ద్వారా ఈ-పంట నమోదు చేసుకున్న రైతుల జాబితా ప్రదర్శించను న్నట్టు తెలిపారు. రైతులు వాటిని సరిచూసుకొని తప్పొప్పులు రైతు సేవా కేంద్ర ఇన్‌ఛార్జిలకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇఒ వీరభద్రస్వామి, విఆర్ఒ నారాయణ, దేవాడ దుర్యోధన, పొందూరు బాలకృష్ణ, పండి విజయకుమార్, హరిహరరావు, జగదీష్ పాల్గొన్నారు.

జాబితాను ప్రదర్శిస్తున్న ఇఒ వీరభద్ర స్వామి

మొక్కను నాటుతున్న గణపతి

మొక్కలతోనే భవిష్యత్

ప్రజాశక్తి- సోంపేట

భావితరాలకు భవిష్యత్ ఉండాలంటే ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని, వాటిని సంరక్షించుకోవాలని రామ్ బుడ్డి గణపతి అన్నారు. మండలంలోని కొర్లం పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం పల్లె పండగ వారోత్సవాల్లో భాగంగా హెచ్ఎం సూర్యప్రకాశరావు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆర్.జానకిరావు, ఎస్.ఢిల్లీరావు, పి.చందు, పి.జోగారావు, టి.మోహనరావు పాల్గొన్నారు.

దీక్ష చేస్తున్న యువకులు

కొనసాగుతున్న దీక్షలు

కవిటి: తరగతి ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో తమ భవిష్యత్ భరోసా కోసం బెంతు ఒరియాలు కవిటిలో చేస్తున్న రిలే నిరాహారదీక్షలు 294వ రోజుకి చేరుకున్నాయి. అందులో భాగంగా మంగళవారం దీక్షలో కొన్నాయిపుట్టుగ యువత పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ తమకు గుర్తింపు లభించే వరకూ, తమ బిడ్డల భవిష్యత్తుకు భరోసా దక్కేవరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

గడ్డివామి దగ్ధం

టెక్కలి రూరల్ : టెక్కలి మేజర్ పంచాయతీ పరిధిలోని ఎన్‌టిఆర్ కాలనీ 9వ లైన్‌లో బత్తుల నారాయణరావుకు చెందిన గడ్డివామి మంగళవారం దగ్ధమైంది. దీంతో పరిసరాల్లో పొగ కమ్ముకోవడంతో బాధితుడు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించాడు. ఘటన స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది శకటంతో చేరుకుని మంటలను అదుపుచేశారు. కాగా, ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు.

నేడు ఉచిత వైద్య శిబిరం

రణస్థలం : మండల కేంద్రంలో సూర్య ఆస్పత్రి ఆవరణలో బుధవారం జిల్లా అంధత్వ నివారణ సంస్థ, ఇడదాసుల విద్య ఆరోగ్య ఫౌండేషన్, శంకర్ ఫౌండేషన్ సంయుక్తంగా ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఇడదాసుల విద్య ఆరోగ్య ఫౌండేషన్ ఇడదాసుల తిరుపతిరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో ఉచిత బిపి, సుగర్, గుండెకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహిస్తారని అన్నారు. ఈ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అభివృద్ధికి ఆమడదూరంలో ఆమదాలవలస

ప్లకార్డును ప్రదర్శిస్తున్న గాంధీ

ఆమదాలవలస : అభివృద్ధికి ఆమడ దూరంలో అవినీతికి ముందు వరసలో ఆమదాలవలస నియోజకవర్గం ఉందని సువ్వారి గాంధీ ఆరోపించారు. పట్టణంలోని బొడ్డేపల్లిపేటలోని ఆయన కార్యాలయంలో అవినీతిపై, అక్రమాలపై ప్లకార్డులను మంగళవారం ప్రదర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అక్షర క్రమంలో ముందుండే ఆమదాలవలస అవినీతిలో ముందుందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ నాలుగు నెలల కాలంలో ఆమదాలవలస మండలంలో ప్రభుత్వ ఇసుక రీచ్ లు లేకపోయినప్పటికీ యథేచ్ఛగా కొన్ని వందల లారీల్లో ఇసుక విశాఖపట్నానికి తరలిపోతుందని అన్నారు. బూర్జ మండలంలోని ఖాఖండ్యాం లో ప్రభుత్వ ఇసుక స్టాక్ పాయింట్ ఏర్పాటు చేసినా ఒక బిల్లుపై నాలుగైదు లారీల ఇసుక తరలిపోతుందని ఆరోపించారు. సమావేశంలో పేడాడ వైకుంఠరావు, సువ్వారి అనిల్ కుమార్, అన్నెపు సూరిబాబు, రాపాక ఎంపిటిసి మాజీ సభ్యులు పోతురాజు సూర్యారావు బొడ్డేపల్లి గోవింద పాల్గొన్నారు.

మద్యం తాగి ఆటోలు నడపరాదు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మద్యం తాగి డ్రైవర్లు ఆటోలను నడపరాదని కె.వెంకటేష్ అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నియమ నిబంధనలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాహనదారులు వాహనానికి సంబంధించిన ధ్రువపత్రాలు తప్పనిసరిగా వెంట ఉంచుకోవాలని సూచించారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రయాణికులతో మర్యాదగా

అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ వెంకటేష్

ప్రవర్తించాలని సూచించారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా నడచుకోవాలన్నారు. ప్రభుత్వ నియమ నిబంధనలకు విరుద్ధంగా ఆటోలను నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

చేపల పెంపకానికి ప్రోత్సాహం

అవగాహన కల్పిస్తున్న ఎపిఒ రమణారావు

ప్రజాశక్తి- పోలాకి

ఉపాధి హామీ ద్వారా చెరువులు పనులు నిర్వహించి తద్వారా చేపలు పెంపకాన్ని ప్రోత్సాహం అందిస్తున్నట్లు ఎపిఒ రమణారావు తెలిపారు. మండలంలోని ప్రియాగ్రహారంలో ఫిషరీస్ ఫౌండ్ పనులను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో పిర్యాగ్రహారం, చెల్లాయివలస, గాతలవలస, దీర్ఘాశి, మబగాం, చీడివలస, పోలాకి ఏడు చెరువులకు పనులు ప్రారంభించామని తెలిపారు. ఈ పనులు నిర్వాహణకు ఒక్కొక్క చెరువుకు రూ.పది లక్షల నిధులు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లావేటి కృష్ణారావు, ఎంపిటిసి ప్రసాదరావు, క్షేత్ర సహాయికులు రమేష్ పాల్గొన్నారు.

రవికుమార్‌కు సముచిత స్థానం కల్పించాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు టిడిపి అధిష్టానం సముచిత స్థానం కల్పించాలని విశ్రాంత తహశీల్దార్, విజయనగరం కాళింగ సంక్షేమ సంఘం అధ్యక్షులు, టిడిపి నాయకుడు పేడాడ జనార్ధనరావు కోరారు. మండలంలోని తన స్వగ్రామం శ్రీహరిపురంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. కళింగాంధ్రలో కాళింగుల ప్రాభవం కలిగిన ఆమదాలవలస అసెంబ్లీ నియోజకవర్గంపై టిడిపి అధిష్టానం చిన్నచూపు చూడడం తగదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల తాము ఉత్తరాంధ్రలోని కాళింగ నాయకులతో సమావేశమైన నేపథ్యంలో రవికుమార్ సేవలను సిఎం చంద్రబాబు నాయుడు గుర్తించాలన్న ఆశాభావం అందరిలోనూ వ్యక్తమైందని తెలిపారు.

అవగాహన కల్పిస్తున్న రమేష్ కృష్ణ

చిరుధాన్యాల మార్కెటింగ్‌పై శిక్షణ

ప్రజాశక్తి- లావేరు

చిరుధాన్యలు, ఆహారపదార్థాలు ఉత్పత్తి, ప్యాకింగ్ బ్రాండింగ్, మార్కెటింగ్‌పై ప్రతిఒక్కరికీ అవగాహన కలిగి ఉండాలని నాబార్డు జిల్లా అభివృద్ధి మేనేజర్ రమేష్‌కృష్ణ అన్నారు. మండలంలోని తాళ్లవలసలో నాబార్డు ప్రాంతీయ కార్యాలయం అమరావతి వారి ఆర్థిక సహకారంతో యూత్ క్లబ్ బెజ్జిపురం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యాన 30 మంది స్వయం శక్తి సంఘాల సభ్యులకు చిరుధాన్యాలు, ఆహారపదార్థాలు తయారీలో ప్యాకింగ్ బ్రాండింగ్ మార్కెటింగ్‌పై మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాబార్డు ద్వారా శిక్షణను ఉపయోగించుకొని పిఎం ఎఫ్ఎంఇ పథకాలతో రుణాలు పొంది సొంతంగా యూనిట్లు నెలకొల్పుకోవాలన్నారు. పదార్థాలు తయారులో లైసెన్స్ పొంది ఆరోగ్య వంతమైన ఉత్పత్తిలు ప్రజలకు అందించాలన్నారు. రాగోలు కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్త సునీత మాట్లాడుతూ ఆహార పదార్థాలు తయారీలో నాణ్యత, పరిశుభ్రత అవసరమన్నారు. ఉత్పత్తులు ప్యాకేజీలో మెలుకువలు ఆచరించాలని సూచించారు. సంస్థ అధ్యక్షులు ఎం.ప్రసాదరావు, తాళ్లవలస మాజీ సర్పంచ్ ముప్పిడి మురళీమోహన్‌లు మాట్లాడారు. కార్యక్రమంలో వెలుగు అధికారులు శ్రీగౌరి, పైడిభీమవరం డిసిసిబి బ్యాంకు మేనేజర్ నీరజ, యూత్ క్లబ్ కార్యదర్శి ఇజ్జడా అప్పారావు, గంట్యాడ అప్పలనాయుడు, సిఇఒ నున్న శ్రీనివాసరావు, గౌరినాయుడు పాల్గొన్నారు.

సాయిబాబా పోరాట యోధుడు

ప్రజాశక్తి- పలాస

ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన ఉద్యమకారుడు జి.ఎన్.సాయిబాబా అని దేశభక్తి ప్రజాతంత్ర ఉద్యమం రాష్ట్ర నాయకులు వీరాస్వామి అన్నారు. మండలంలోని బొడ్డపాడు అమరవీరుల స్మారక భవనంలో ప్రజా సంఘాల ఆధ్వర్యాన పౌర హక్కుల సంఘం అధ్యక్షులు పత్తిరి దానేష్ అధ్యక్షత మంగళవారంసంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాయిబాబా విద్యార్థి దశ నుంచే శాస్త్రీయ విద్య కోసం విద్యార్థి ఉద్యమాల్లో పాల్గొన్నారని అన్నారు. ఆయనపై ఎన్ని కుట్రలు చేసినా తాను నమ్ముకున్న భావజాలంను ఏ క్షణం కూడా వదిలిపెట్టలేదని, అలాంటి గొప్ప మేధావి సాయిబాబా అని కొనియాడారు. కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్

మాట్లాడుతున్న వీరస్వామి

న్యూడెమోక్రసీ నాయకులు బాలకృష్ణ, పిఒడబ్ల్యు నాయకులు పోతనపల్లి కుసుమ, పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు వినోద్, ఇఫ్తు నాయకులు వీరస్వామి, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ నాయకులు మల్లేశ్వరరావు, రామారావు, సిపిఐ ఎంఎల్ లింపియావో నాయకులు దున్న గోవిందు, డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర బాధ్యులు ధర్మారావు, కుల నిర్మూలన పోరాట సమితి జిల్లా బాధ్యులు ప్రభాకర్‌లు పాల్గొన్నారు.

ఎస్‌జిఎఫ్ ఆర్థికసాయం

కవిటి: తీవ్రమైన వ్యాధులతో బాధపడుతున్న మండలంలోని గొర్లెపాడుకు చెందిన బూర్లి శ్రీకాంత్‌కు ఎస్‌జిఎఫ్ స్వచ్ఛంద సంస్థ అండగా నిలిచింది. శ్రీకాంత్ వైదానికి రూ.6 లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు చెప్పడంతో దాతల సాయం కోసం ఎదురుచూస్తున్నారు. సమాచారం తెలుసుకున్న ఎస్‌జిఎఫ్ సభ్యులు మంగళవారం గ్రామానికి చేరుకుని శ్రీకాంత్‌కు రూ.20 వేలు అందించారు.

ఆర్థికసాయం అందిస్తున్న సభ్యులు

కవిటి : ప్లకార్డులను ప్రదర్శిస్తున్న చిన్నారులు

చదువుకి వైకల్యం అడ్డుకాదు

ప్రజాశక్తి- కవిటి

చదువుకి వైకల్యం అడ్డుకాదని, మూడేళ్లలోపే అభ్యసన వైకల్యం కలిగిన పిల్లలను గుర్తించి వారికి సరైన శిక్షణ ఇస్తే సాధారణ విద్యార్థులుగా తీర్చిదిద్దవచ్చని బొరివంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సనపల రామకృష్ణ అన్నారు. సమగ్ర శిక్షణ ద్వారా వికలాంగులకు చేపడుతున్న వివిధ కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం బొరివంకలో అభ్యసన వైకల్యాలు గల పిల్లల గుర్తింపు వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైకల్యం లేని సమాజాన్ని ఏర్పాటు చేయడానికి ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని కోరారు. స్పెషల్ ఎడ్యుకేటర్ చిన్నారావు, సహిత విద్య ఉపాధ్యాయులు కృష్ణారావు, అరుణ్‌కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంతబొమ్మాళి : సంతబొమ్మాళి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎంఇఒలు జె.చిన్నవాడు, అర్జునుడు ఆధ్వర్యాన అభ్యసన వైకల్యంపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రణస్థలం: అభ్యాసన వైకల్యంపై అవగాహన కలిగి ఉండాలని ఎంఇఒ ఎ.త్రినాథరావు, రణస్థలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.రమణయ్య పిలుపు నిచ్చారు. భవిత ఉపాధ్యాయులు ఎం.బాలరాజు, ఎం.రూపదేవి, స్పెషల్ ఎడ్యుకేటర్ ఎం.డి.జె.బేగం ఆధ్వర్యాన మంగళవారం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిస్లెక్సియా అనేది ఒక వయసులో వారు సాధారణంగా చదువగలిగిన దానికన్నా తక్కువగా చదివేలా చేసే ఒక వ్యాధి అని, 1960వ దశకం వరకు దీనిని వర్డ్ బ్లైండ్‌నెస్ అనేవారని అన్నారు. ఇది వేర్వేరు వ్యక్తులలో వేర్వేరు స్థాయిల్లో ఉంటుందన్నారు. పదాలను సక్రమంగా పలకకపోవడం, రాయకపోవడం, తొందరగా చదవలేకపోవడం, వేరే వాళ్లు చదువుతుంటే అర్థం చేసుకోలేకపోవడం వంటి లక్షణాలని పేర్కొన్నారు. ఈ లక్షణాలు సాధారణంగా పాఠశాలలో గుర్తిస్తారని పేర్కొన్నారు. ఇది ఉన్న వారిలో ఏకాగ్రతా సమస్యలు, భాష, సంఖ్యలు నేర్చుకోవడంలో ఇబ్బందులు ఎక్కువగా ఉండే అవకాశం ఉంటుందన్నారు. ఇది జన్యుపరమైన, చుట్టూ ఉన్న వాతావరణం ముఖ్యమైన కారణాలు కావచ్చని విశ్వసిస్తున్నామని అన్నారు. మెదడుకు తీవ్రమైన గాయం కావడం, పక్షవాతం రావడం, డెమెన్షియా (మతిమరుపు) వంటి వాటివల్ల కూడా డిస్లెక్సియా వచ్చే అవకాశం ఉంది. ఇటువంటి సమస్యలు ఉంటే విద్యార్థులు తెలపాలని కోరారు.

నందిగాం : నందిగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రపంచ డిస్లెక్సియాపై వారోత్సవాలను ప్రధానోపాధ్యాయులు వై.హరిప్ప, ఉపాధ్యాయులు పి.రాణి అధ్యక్షతన అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్.వెంకటరావు పాల్గొన్నారు.

సంతబొమ్మాళి : ర్యాలీలో పాల్గొన్న ఎంఇఒలు

పొందూరు: ప్లకార్డులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

రణస్థలం : అవగాహనా ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఎంఇఒ కె.అప్పారావు ఆధ్వర్యాన ఉపాధ్యాయులు డిస్లెక్సియాపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు ఎన్.విశ్వనాథం, సహిత విద్య ఉపాధ్యాయులు తేజేశ్వరరావు, సూర్యం, సోమేష్, హేమకుమారి, జయలక్ష్మి, కామరాజు, పద్మజ పాల్గొన్నారు..

పొందూరు: పొందూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు పి.వెంకటరావు ఆధ్వర్యాన అభ్యాసన వైకల్యంపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ కె.లక్ష్మణరావు, ఐఇఆర్‌పి రాధారాణి, దినేష్ పాల్గొన్నారు.

పల్లె పండగతో గ్రామాల ప్రగతి

పొందూరు : శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

పల్లె పండగతో గ్రామాల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కోళారి, ధర్మపురం, తులసిగాం గ్రామాల్లో పల్లె పండగ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిసి రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో దాసరి రాజు, మాజీ ఎంపిపి ఢిల్లీరావు, కామేశ్వరరావు, నరేంద్ర రెడ్డి, సహదేవ్‌రెడ్డి, సూర్యనారాయణ, బాబ్జీ, సారథి, నాగరాజు, దుర్యోధన రెడ్డి, నీలవేణి, హేమరాజ్ పాల్గొన్నారు.

పొందూరు : పల్లె పండగలో భాగంగా మండలంలోని తండ్యాం, పొందూరు, కృష్ణాపురం, నందివాడ పంచాయతీల్లో సిసి రోడ్లు, కాలువల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే కూన రవికుమార్ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపిపి కిల్లి ఉషారాణి, ఎంపిడిఒ మీసాల మన్మధరావు, ఇన్‌ఛార్జి తహశీల్దార్ వెంకటేష్, టిడిపి మండల అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహన్, ఎపిఒ శ్రీనివాసరావు, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కూన వెంకటసత్యనారాయణ, సర్పంచ్‌లు రేగిడ లక్ష్మి, కిల్లాన అప్పలనారాయణమ్మ, అంబల్ల లక్ష్మి పాల్గొన్నారు.

జలుమూరు : 'పల్లె పండుగ' పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని లింగాలవలస పంచాయతీలో ఉపిరిజోలలో ఉపాధి హామీ నిధులు రూ.98 లక్షలతో బిటి రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత వైసిపి పాలన ఐదేళ్లలో గ్రామీణ ప్రాంతాలకు కనీసం మౌలిక సదుపాయాలకు నోచుకోక అధ్వాన పరిస్థితికి చేరుకుందని ఆరోపించారు. పల్లె పండగ పేరుతో కూటమి ప్రభుత్వం మౌలిక వసతులను కల్పిస్తుందని అన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్, ఎంపిడిఒ, పంచాయతీరాజ్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

శ్రీకాకుళం రూరల్ : శ్రీకాకుళం రూరల్ మండలం తండ్యంవలస, సిలగాం సింగువలస, అలికాం, భైరివానిపేట గ్రామాల్లో ఎమ్మెల్యే గొండు శంకర్ సిసి రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. నియోజకవర్గంలో రూ.32 కోట్లతో రోడ్లు, కాలువలు, ఇతర పనులను చేపడుతున్నట్టు వివరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ బొడ్డేపల్లి శైలజ, కార్యకర్తలు పాల్గొన్నారు. **మెళియాపుట్టి** : గాంధీజీ కలగన్న గ్రామ స్వరాజ్యం సాధించడానికి పల్లె పండగ నిర్వహిస్తున్నామని ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా, ఎఎంసి మాజీ వైస్ ఛైర్మన్ అనపాన రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మండలంలోని మెళియాపుట్టి, ఆంపురం, గొట్టిపల్లి, ఇలైపురం గ్రామాల్లో సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ గణేష్, ఎపిఒ రవి, ఇసి ఆదినారాయణరెడ్డి, ఎపిఎం గోవిందమ్మ, రేఖన వాసు, మాడుగుల బానోజీరావు, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

రణస్థలం : మండలంలోని దేరసాంలో సిసి రోడ్డు నిర్మాణానికి జనసేన నాయకులు దన్నాన రవీంద్ర శంకుస్థాపన చేశారు.

పలాస : మండలంలోని టెక్కలిపట్నం, బంటుకొత్తూరు గ్రామాల్లో పల్లె పండగలో భాగంగా సిసి రోడ్ల నిర్మాణాలకు ఎంపిపి ఉంగ ప్రవీణ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ వసంతరావు, పంచాయతీ విస్తరణాధికారి మెట్ట వైకుంఠరావు, పంచాయతీరాజ్ ఎఇ గోపయ్య పాల్గొన్నారు.

కొత్తూరు : మండలంలోని కర్లెమ్మ ఎన్ఎన్ కాలనీ, కర్లెమ్మ ఆర్ఆర్అండ్ కాలనీల్లో పల్లె పండగలో భాగంగా వైస్ ఎంపిపి లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ నీరజ, సర్పంచ్‌లు లోతుగెడ్డ భగవాన్‌దాస్ నాయుడు, పి.అప్పారావు, ఎల్.తాతబాబు, వై.దాసునాయుడు, వెంకటకృష్ణ, జెఇ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

సోంపేట మండలంలోని జింకిభద్ర, బెంకిలి, ఇసుకలపాలెం గ్రామాల్లో పల్లె పండగలో భాగంగా అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో నాగేశ్వరరావు, పి.కృష్ణమూర్తి, దాసరి రాజు, బి.అంకమ్మ, టి.దుర్యోధన పాల్గొన్నారు.

సేవలే గుర్తింపునిస్తాయి

టెక్కలి: సమాజంలో మనం చేసుకున్న సేవలే గుర్తింపునిస్తాయని మెళియాపుట్టి ఎంఇఒ మల్లారెడ్డి పద్మనాభం అన్నారు. స్థానిక ప్రజా చైతన్య కళా సమితి ఆధ్వర్యాన వైద్యులు కీర్తిశేషులు ఎన్.వి.నాయుడు ప్రథమ వర్ధంతి సభ మంగళవారం నిర్వహించారు. ముందుగా నాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలో మొట్టమొదటి పేదలకు సేవలందించే వైద్యునిగా నాయుడు గుర్తింపు తెచ్చుకున్నారని అన్నారు. నాయుడు కుమారుడు దిలీప్ మాట్లాడుతూ తండ్రి ఆశయాలకు అనుగుణంగా టెక్కలిలోనే సేవలందిస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో కళాసమితి అధ్యక్షులు ఉత్తర కవాటం గణపతిరావు, సమితి నిర్వాహకులు చిలుకు కృష్ణారావు, దూసి ఆంధ్రాస్టాలిన్ మూల తాతయ్య, ఆనిశెట్టి చిట్టెన్న, రామమును రమేష్‌కుమార్, రోణంకి రామచంద్రరావు, దసుంజయరావు, బొడ్డ అయ్యబాబు ఆకుల ప్రకాష్, ఎన్.హెచ్.కె.జనార్ధన్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వినయ్ కుమార్

వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని బసవకొత్తూరులో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీం ఆధ్వర్యాన ఎపి శాక్స్ సహకారంతో జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సలహా మేరకు మంగళవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో డాక్టర్ ఎస్ కె అఫ్రిది, డాక్టర్ అజయ్ 162 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందించారు. అదేవిధంగా 32 మందికి ఇసిజి పరీక్షలు నిర్వహించి, 88 మందికి హెచ్‌ఐవి టెస్టులు నిర్వహించారు. అనంతరం జిల్లా రిసోర్స్ పర్సన్ హనుమంతు నాగభూషణం మాట్లాడుతూ ప్రతిఒక్క వ్యక్తి తన హెచ్‌ఐవి స్థితిని తెలుసుకోవాలని, మిగతా వారికి దానిపై అవగాహన కల్పిస్తూ ఆరోగ్యవంతమైన జీవితం గడపాలని సూచించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు ఎం.ఈశ్వరరావు, రాముడు, ఎంఎల్‌హెచ్‌పి టి.పార్వు, ఎఎన్ఎం ఢిల్లమ్మ, ఫార్మసిస్టు నేలవేణి, జోనల్ సూపర్‌వైజర్ టి. సుధాకర్, క్లస్టర్ లింక్ వర్కర్ గున్న రవి తదితరులు పాల్గొన్నారు.

రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

అవగాహన కల్పిస్తున్న రవిబాబు

ఆమదాలవలస : సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఫైనాన్స్ లీటరసీ కౌన్సిలర్ సువ్వారి రవిబాబు అన్నారు. పురపాలక సంఘం పరిధిలోని నాలుగో వార్డు గేదెలవానిపేటలో స్వయం సహాయక సంఘ సభ్యులకు యూనియన్ బ్యాంకు సౌజన్యంతో ఎన్ఎస్‌టి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యాన మంగళవారం ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ప్రాముఖ్యతను తెలుసుకొని పొదుపు చేయాలన్నారు. ఫలానా బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నామని ఎవరైనా ఫోన్ చేసి ఎటిఎం పిన్ కార్డు, బ్యాంకు ఎకౌంటు వివరాలను అడిగితే అటువంటి వారికి వివరాలు చెప్పవద్దని సూచించారు. బ్యాంకు అధికారులు ఎవరు ఫోన్ చేసి వివరాలు అడగరని తెలిపారు. కార్యక్రమంలో సిఎఫ్ఎల్ కో-ఆర్డినేటర్లు చిగురుపల్లి వెంకటేష్ (చిన్ను), రామారావు, ఆర్‌పిలు విజయలక్ష్మి, లక్ష్మి పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

కష్టపడి చదివితే విజయం

పాతపట్నం : చిన్నతనం నుంచే కష్టపడి చదివితే విజయం సాధిస్తామని పూర్వ విద్యార్థి, రిజర్వ్ బ్యాంక్ మేనేజర్ భైరి వినయ్ కుమార్ అన్నారు. స్థానిక విక్టరీ స్కూల్‌లో పదో తరగతి విద్యార్థులతో మంగళవారం ముచ్చటించి తన జీవిత అనుభవాలను పంచుకున్నారు. తానూ ఇక్కడే ఎల్‌కెజి నుంచి పది వరకు ఇక్కడే చదువుకున్నానని తెలిపారు. చిన్నప్పటి నుంచే పెద్ద టార్గెట్ పెట్టుకుని దానివైపు శ్రమిస్తే తప్పనిసరి విజయం సాధించగలమన్నారు. ఈయనతో పాటు ఆయన తండ్రి కామేశ్వరరావు, తారాకేశ్వరరావు ఉన్నారు.

ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న బ్లడ్ బ్యాంకు సభ్యులు

రక్తదానంతో ప్రాణదానం

కవిటి: ఒక వ్యక్తి చేసే రక్తదానం మరొకరికి ప్రాణదానం చేస్తుందని డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం ఫౌండేషన్ సభ్యులు అన్నారు. కలాం జయంతిని పురస్కరించుకొని మండలంలోని సంత కూడలిలో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో రక్తదానం చేసిన పలువురికి ఉద్దానం బ్లడ్ బ్యాంక్ వారు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఉద్దానం బ్లడ్ బ్యాంకు, అబ్దుల్ కలాం ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఆకతాయిలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి- పలాస

గతకొన్ని రోజులుగా నియోజకవర్గ వ్యాప్తంగా దాడులు, దొంగతనాలు, దోపిడీలు అధికం అవుతున్నాయని, ఆకతాయిలపై చర్యలు తీసుకోవాలని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ దుర్గారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు కాశీబుగ్గ సిఐ డి.మోహనరావును మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ బేనర్ చింపడం, సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. నియోజకవర్గంలో శాంతిభద్రతల అదుపు కోసం శాంతి ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు.

వినతిపత్రం అందజేస్తున్న దుర్గారావు

సస్యరక్షణతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

సస్యరక్షణతో అధిక పంట దిగుబడులు సాధించవచ్చునని మండల ఎఒ మెట్ట మోహనరావు అన్నారు. మండలంలోని శ్రీనివాసచర్యులపేటలోని రైతు సేవా కేంద్రంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. పంటల్లో వచ్చే చీడపీడలు, తెగుళ్లను ఏ విధంగా ఎదుర్కోవాలన్న దానిపై రైతులకు అవగాహన కల్పించారు. ఆర్థిక పరిమిత స్థాయి దాటితేనే మందులు పిచికారీ చేయాలని అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణం ఉక్కపోత ఎక్కువగా ఉండటం, వేడి ఎక్కువగా ఉండటం వల్ల దోమ ఉధృతి పెరిగే అవకాశం ఉంటుందని అన్నారు. రైతులు రోజు పొలాన్ని పరిశీలించాలని దోమ కనిపించిన వెంటనే వ్యవసాయ అధికారులను సంప్రదించాలని తెలిపారు. వ్యవసాయ అధికారులు సూచించిన మందులనే పిచికారీ చేయాలన్నారు. 200 లీటర్ల నీటిని ఉపయోగించి మొదళ్ల తడిచేలా పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బొడ్డేపల్లి గౌరీపతి, ఎంపిటిసి ప్రతినిధి బొడ్డేపల్లి లక్ష్మీనారాయణ, విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్ పీసా జగదీశ్వరరావు పాల్గొన్నారు.

నందిగాం: ఖరీఫ్ సీజన్‌లో రైతులు సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడిని పొందవచ్చునని మండల ఎఒ పి.శ్రీకాంత్ వర్మ అన్నారు. మండలంలోని పెద్ద బాణాపురం, కవిటి అగ్రహారం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో పరిశీలించి చీడపీడల నివారణకు, మందులు పిచికారీ చేసినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

ఆమదాలవలస : ఎఒ మోహనరావు

వివరించారు. మందు పిచికారీ చేసినప్పుడు మాస్క్ విధిగా ధరించాలని సూచించారు. యూరియా వాడకాన్ని తగ్గించి చీడపీడల నివారించుకోవచ్చునని సూచించారు. సేంద్రీయ ఎరువులు వాడకం ద్వారా అధిక లాభాలు పొందే వీలు ఉందన్నారు. ఈ-క్రాప్ నమోదు వివరాలను రైతు సేవా కేంద్రాల వద్ద చూసుకోవాలన్నారు.

కవిటి: ఖరీఫ్ సీజన్లో పంటలకు ఆశించే పురుగులు, తెగుళ్లపై రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల ఎఒ బడగల దుర్గాప్రసాద్ సూచించారు. మండలంలోని రాజపురం, భైరిపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భైరిపురం సర్పంచ్ పుల్లట ప్రభాకరరావు, అగ్రికల్చర్ అసిస్టెంట్ గణపతి, టిడిపి రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పుల్లట సంతోష్ పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మండలంలోని భరణికోట, కరజాడ గ్రామాల్లో ఎఒ దానకర్నుడు ఆధ్వర్యాన పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పలాస వ్యవసాయ శాఖ ఎడి లింగాల మధుబాబు పొలాలను పరిశీలించి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, రవి, పున్నయ్య, గ్రామ వ్యవసాయ సహాయకులు సునీత, ధరన్, నవీన్ పాల్గొన్నారు.

సోంపేట : అవగాహన కల్పిస్తున్న ఎఒ నరసింహమూర్తి

సోంపేట : మండలంలోని ఇసకలపాలెం, బెంకిలి గ్రామాల్లో మండల ఎఒ నరసింహమూర్తి ఆధ్వర్యాన పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వరి ఆశించే తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సంధ్య, లక్ష్మీనారాయణ, కార్యదర్శి నారాయణ పాల్గొన్నారు.